క్లుప్తంగా

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

టెక్కలి రూరల్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని టెక్కలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఎ.విజయ్‌కుమార్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. కోటబొమ్మాళి మండలం చిన్న హరిశ్చంద్రాపురం గ్రామానికి చెందిన జామి సురేష్ అక్రమంగా మద్యం తరలిస్తున్నారనే సమాచారంతో తమ సిబ్బంది ఆదివారం రాత్రి దాడి చేసి అతన్ని అదుపులో తీసుకున్నారని చెప్పారు. సురేష్ నుంచి తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి అతన్ని అరెస్టు చేసినట్టు తెలిపారు.

మాజీ సీఎం జగన్ ఆశయ సాధనకు కృషి


లోకేశ్వరరావు

ఇచ్ఛాపురం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగం రెడ్డిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుక్క లోకేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంఘం అధ్యక్షుడిగా తనకు బాధ్యతలు అప్పగించిన జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. గడచిన 25 సంవత్సరాలుగా పూరీ, గంజాం, శ్రీకాకుళం జిల్లా రెడ్డిక కుల సంఘానికి జనరల్ సెక్రటరీగా, ఎనిమిది సంవత్సరాలుగా రెడ్డిక కుల రాష్ట్ర అధ్యక్షులుగా, మూడు సంవత్సరాలుగా రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్‌గా.. రెడ్డిక కుల సంఘంతో పాటు ఇతర కులసంఘాల అభివృద్ధికి చేసిన సేవలను గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ అనుబంధ విభాగానికి అధ్యక్షునిగా తనను నియమించడం ఆనందంగా ఉందన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పరిసరాలు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సోంపేట: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెల్త్‌అసిస్టెంట్ హేమంత్ అన్నారు. జింకిభద్ర గ్రామంలో పరిశుభ్రతపై సోమవారం అవగాహన కల్పించారు. ఇంట్లో వాడే నీటిని రోడ్లపైకి వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు రోడ్లపై నిల్వ ఉంటే దోమల ఉధృతితో రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఉప సర్పంచ్ సాహుకారి జానకీరావు, ఎంఎల్‌హెచ్ పి.కళావతి, ఏఎన్‌ఎం శిరీష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తిలక్ పరామర్శ


రమణమూర్తి కుటుంబాన్ని పరామర్శిస్తున్న తిలక్ తదితరులు

కోటబొమ్మాళి: మండలంలోని సరియాబొడ్డపాడు గ్రామానికి చెందిన చాప రమణమూర్తి తల్లి లక్ష్మీనారాయణమ్మ, అదే గ్రామానికి చెందిన యిరగట్టపు రమణమూర్తి తండ్రి జనార్దనరావు ఇటీవల మరణించారు. వారి ఇరువురి కుటుంబసభ్యులను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో దుబ్బ వెంకటరమణారావు, పార్టీ నాయకులు నూక సత్యరాజ్, సంపతిరాజు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు అజిత్


అజిత్ మజ్జి

ఇచ్ఛాపురం రూరల్: గుంటూరులో ఈ నెల 23న జరగనున్న రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన అజిత్ మజ్జి ఎంపికయ్యాడు. సోమవారం విశాఖపట్నంలో జరిగిన వెయ్యి మీటర్ల పందెంలో పాల్గొన్న అజిత్ మజ్జి 55 సెకండ్లలో గమ్యానికి స్థానానికి చేరుకొని రెండో స్థానంలో నిలవడం ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.


ప్రారంభానికి సిద్ధమైన అరకబద్ర వంతెన

నెరవేరనున్న దశాబ్దాల కల!

- ప్రారంభానికి సిద్ధంగా అరకబద్ర వంతెన

ఇచ్ఛాపురం రూరల్: 'అభివృద్ధి కళ్లముందు కనిపించాలి..సంక్షేమం ఆర్తుల లోగిళ్లలోకే వెళ్లాలి' ఇదే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతం. అధికారం చేపట్టిన నాటి నుంచీ అంతే బాధ్యతగా పనిచేశారు. దేశానికి పట్టుగొమ్మలైన పల్లెలకు ప్రాణం పోశారు. విద్య, వైద్యం, మౌలిక వసతులతో ప్రగతికి చిరునామాగా మార్చారు. 2014లో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని అరకబద్ర వంతెన నిర్మాణాలకు శంకుస్థాపన చేసి ప్రారంభంలోనే చేతులెత్తేస్తే.. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ బాధ్యతలను చేపట్టి 96 శాతం పనులు పూర్తి చేసి ఈ ప్రాంతీయుల కలను సాకారం చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలో లేకపోయినా.. జగనన్న తమకు అందించిన గొప్ప వరంగా స్థానికులు చెబుతున్నారు.

వంతెన గురించి ఇలా..

అరకబద్ర–కొళిగాం గ్రామాల మధ్య పారుతున్న బాహుదానదిపై వంతెన నిర్మించడానికి 2018 నవంబర్ 28న రూ.1380.28 లక్షలతో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు సంయుక్తంగా శిలాఫలకం వేశారు. సుమారు పది గ్రామాల ప్రజల కలగా మారిన ఈ వంతెన పనులు ఇలా ప్రారంభించి, అలా చేతులెత్తేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కృషితో మరల వంతెనకు రీ టెండర్‌తో రూ.1380.28 లక్షలతో వంతెన పనులు ప్రారంభించారు. వంతెన పనులు నత్తనడకన సాగినప్పటికీ ఈ ఏడాది జరిగిన ఎన్నికల సమయానికి పనులు దాదాపు పూర్తి దశకు చేరుకుంది. ప్రస్తుతం అప్రోచ్ రోడ్డు పనులు చురుకుగా సాగుతున్నాయి. మరో వారం, పది రోజుల్లో వంతెన ప్రారంభానికి సిద్ధంగా ఉందని కాంట్రాక్టర్ చెబుతున్నారు.


అప్రోచ్ రోడ్డు పనులు పరిశీలిస్తున్న సీడీప్ మాజీ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

చిన్నపాటి లోపాలు సరిచేసుకోవాలి



అరకబద్ర–కొళిగాం గ్రామాల మధ్యలో పారుతున్న బహుదానదిపై బ్రిడ్జి నిర్మించాలని దశాబ్దాల నుంచి ప్రభుత్వాలను కోరుతున్నాం. గతంలో టీడీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించి వదిలేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన పూర్తి చేసేందుకు పూనుకుంది. చిన్నపాటి లోపాలు సరిచేసుకోవాలి. ముఖ్యంగా అప్రోచ్‌రోడ్డుపై ప్రత్యేక దృష్టి సారిస్తే వంతెన మరింత నాణ్యవంతంగా ఉంటుంది.

– సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, సీడాప్ మాజీ చైర్మన్

కలలో కూడా అనుకోలేదు



మా గ్రామంలోని బహుదా నదిపై వంతెన నిర్మాణం జరుగుతుందని కలలో కూడా అనుకోవలేదు. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి, ఎంతో మంది నాయకులు వచ్చినప్పటికీ అమలు కాలేదు. టీడీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించి చేతులెత్తేస్తే మేమంతా ఆందోళన పడ్డాము. అప్పటి ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కృషి మేరకు వంతెన పనులు మరల ప్రారంభమయ్యాయి. ఇప్పుడు పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది.

– రంగాల కృష్ణారెడ్డి, గ్రామస్తుడు, అరకబద్ర

వంతెన పనులు పూర్తి

వంతెన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ప్రస్తుతం అప్రోచ్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. మరో 15 రోజుల్లో వంతెనను ప్రారంభిస్తాం.

–సనపల రామకృష్ణ, పంచాయతీరాజ్ డీఈ

ప్రజల పక్షాన పనిచేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

- టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్
- టెక్కలి మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం

నందిగాం: కూటమి ప్రభుత్వం బూటకపు హామీలతో గెద్దనెక్కి ప్రజలను నిట్టనిలువునా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. మోసపోయిన ప్రజల పక్షాల నిలబడి పని చేద్దామని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు పిలుపునిచ్చారు. నందిగాంలోని పార్టీ కార్యాలయంలో టెక్కలి మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసి ప్రజల పక్షాన పని చేసేందుకు ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ముందుకు రావాలని కోరారు. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ అని వాగ్దానాలు ఇచ్చి.. అధికారంలోని వచ్చాక వాటి అమలును మరిచారని గుర్తు చేశారు. గ్రామాల్లో రైతులకు కనీసం యూరియా కూడా ఇవ్వలేని స్థితికి చంద్రబాబు ప్రభుత్వం దిగజారిందన్నారు. ఉచిత ఇసుక అని చెప్పి అధికారంలోకి వచ్చి గత ప్రభుత్వం కంటే రెండింతల రేటుకు ట్రాక్టర్ ఇసుకతో భవన నిర్మాణదారులు, కార్మికులను నిలువునా ముంచారని అన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి అమ్మకు వందనం వర్తింపజేస్తామని చెప్పి తల్లిదండ్రులను మోసం చేశారన్నారు. అలాగే మహిళలకు నెలకు రూ.15 వందలు, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అని గ్యాస్ మాటలు చెప్పి మోసం చేసిన వైనాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా చిరుద్యోగులను కక్షపూరితంగా తొలగిస్తున్నారని దుయ్యబట్టారు. టెక్కలి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసి పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో టెక్కలి ఎంపీపీ అట్ల సరోజినమ్మ, సత్తారు సత్యం, పేరాడ రమేష్, హనుమంతు వెంకటేశ్వరరావు, పాత్రూను వెంకట అప్పలస్వామి, గుజ్జు మోహనరెడ్డి, మొత్రి శంకరరావు, వాన తవిటయ్య, కోరాడ కామేష్, పొందల శ్రీనివాస్. సర్లాన బాలక్రిష్ణ,బమ్మిడి కూర్మారావు, రాజేష్, తిరుమలరెడ్డి, మురళీ, అప్పలరెడ్డి, జన్ని చంద్రరావు, పోలాకి మోహనరావు, అప్పలస్వామి, బగాది రామక్రిష్ణ, జగన్నాథం, జగ్గారావు, శంకరరావుమేస్త్రీ, అన్నూరావు, అట్ల రవి, రాహుల్, బలుసు, నాగభూషణరావు పాల్గొన్నారు.

ఘనంగా కన్యాసంక్రమణం పూజలు

సోంపేట: సోంపేట గ్రామ దేవత శ్రీసోమపోలమాంబ దేవాలయం వద్ద సోమవారం ఘనంగా కన్యసంక్రమణం పూజలు కమిటీ సభ్యులు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, లలిత సహస్రనామ పఠనం, అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. సోంపేట పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. జింకిబద్ర గ్రామంలో అసిరిపోలమాంబ దేవాలయంలో అండమాన్ వలస కార్మికుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కంచిలి: స్థానిక కంచమ్మతల్లి అమ్మవారి ఆలయంలో మాస సంక్రమణం సందర్భంగా అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. రాధాకృష్ణ ఆలయం ఆవరణలో హరేరామ హరేకృష్ణ భజన కాలక్షేపాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.


సోంపేట: పూజలందుకున్న సోమపోలమాంబదేవి

వరద బాధితులకు రూ. లక్ష వితరణ

కాశీబుగ్గ: విజయవాడ వరద బాధితులకు పలాస–కాశీబుగ్గ మాజీ సైనిక సంక్షేమ సంఘం తరపున రూ. 1.16 లక్షలను వితరణ చేశారు. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే గౌతు శిరీషకు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఇళ్ల మన్మథరావు, ఉపాధ్యక్షులు బంగారు బారికి, కోశాధికారి ఉప్పాడ వెంకటరావు, సహాయ కార్యదర్శి బమ్మిడి బాబూరావు, వంశీకృష్ణ ఉన్నారు.


ఎమ్మెల్యే శిరీషకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

కొండచిలువ హల్‌చల్

వజ్రపుకొత్తూరు: మండలంలోని సీతాపురం గ్రామంలో సోమవారం కొండచిలువ హల్‌చల్ చేసింది. సుమారు ఎనిమిది అడుగుల పొడవు ఉన్న కొండచిలువ స్థానిక వరి పంట పొలాల్లో రైతులకు తారసపడింది. బుసలు కొడుతూ పెద్ద శబ్దం చేయడంతో రైతులు ఆందోళన చెందారు. కొంతమంది రైతులు ధైర్యం చేసి కర్రలతో కొట్టి చంపడంతో ఊపిరి పీల్చుకున్నారు.


హతమైన కొండచిలువ

మృతుని కుటుంబానికి పరామర్శ

కాశీబుగ్గ: పలాస మండలం మోదుగులపుట్టి గ్రామానికి చెందిన అవుగాన ధర్మారావు ఇటీవల మరణించారు. దీంతో అతని కుటుంబ సభ్యులను పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ సోమవారం పరామర్శించారు. వారి కుమారులు షణ్ముఖరావు, తిరుపతిరావుకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో టి.శ్రీనివాస్, కూన హేమాచలం, అవుగాన దశరద, అనీల్ ఉన్నారు.

మొక్కలు నాటివేత

కాశీబుగ్గ: మందస మండలం రట్టి గ్రామంలోని వల్లభ నారాయణ దేవాలయం, సముద్రతీర ప్రాంతంలో గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో మొక్కలను సోమవారం నాటారు. యువజన సంఘం పిలుపు మేరకు వేప, కదంబ, బాదం, చెర్రీ, తురాయి మొక్కలను నాటి రక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, సర్పంచ్ మామిడి సింహాద్రి, యువకులు రట్టి వైకుంఠరావు, ఈశ్వరరావు, రమేష్, గ్రీన్ ఆర్మీ సభ్యులు నూకల హేమసేందర్, దిలీప్ పాల్గొన్నారు.

శాంతి మార్గంలో పయనిద్దాం

ఇచ్ఛాపురం: ఇస్లాం మతస్థాపకుడు మహ్మద్ ప్రవక్త ప్రజలు శాంతి సన్మార్గాన్ని అనుసరించి దేవునిలో ఐక్యమవ్వడమే మోక్షమార్గమని హితోపదేశం చేసినట్లు మత పెద్దలు గురువు అనీస్‌ఖాద్రీ తెలిపారు. పట్టణంలోని మహ్మద్‌ప్రవక్త జన్మదినం పురస్కరించుకొని ముస్లింలు మిలాద్‌ఉన్ నబీ పండుగను సోమవారం జరుపుకున్నారు. లాలాపేట మసీద్ నుంచి ర్యాలీ చేశారు. కస్పావీధి మసీదు వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్ ముస్లింలను పూలమాలలతో సత్కరించారు. మత గురువు అనీసుల్ ఖాద్రీ, ఎండీ అహ్మద్‌అలీ, ఎండీ ఫరీదుద్దీన్, షేక్‌సర్ఫరాజ్, రఫీ, తాజ్‌ఖాన్, జోహార్‌ఖాన్, అలీమ్‌ఖాన్, అబ్దుల్లా, షఫీ, జిలాని, ఎండీ రఫీ, ఇర్ఫాన్, జాకీర్, రబ్బానీ పాల్గొన్నారు.



ఇచ్ఛాపురంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మత పెద్దలు

కాశీబుగ్గ సీఐకు సత్కారం


సీఐని సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మసీదులో కాశీబుగ్గ సీఐ దాడి దాడి మోహనరావును జామియా మసీద్ నిర్వాహకులు, ముస్లిం పెద్దలు సత్కరించారు.

23 వరకూ ఈ–పంట నమోదు గడువు పెంపు

ఇచ్ఛాపురం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి ఈక్రాప్ నమోదు గడువును ఈనెల 23వ తేదీ వరకు పొడిగించినట్టు మండల వ్యవసాయాధికారి టి.భార్గవి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన చేశారు. వాస్తవంగా ఈ నెల 15వ తేదీతో గడువు ముగియగా.. ప్రభుత్వం గడువు పెంచిందన్నారు. రైతులు తమకు దగ్గర్లో ఉన్న రైతు సేవ కేంద్రాలకు వెళ్లి పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

కుక్కలు స్వైర విహారం

టెక్కలి రూరల్: టెక్కలి పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో జనం భయాందోళన చెందుతున్నారు. వీధుల్లో, రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తూ కనిపించిన వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రి, పగలనే తేడాలేకుండా సంచరిస్తూ ఆందోళన కలిగిస్తున్నాయి. వాహనాల వెంట పరుగులు తీస్తూ దాడులు చేస్తున్నాయి. దీంతో కొంతమంది భయంతో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. వెంబడి క్కులు స్వైరవిహారం చేస్తు కనిపించిన వారిపై దాడిచేస్తున్నాయి. ఆదివారం స్థానిక కోదండరామ వీధి సమీపంలో సాయి అనే బాలుడు సైకిల్ తొక్కుతుండగా అక్కడే ఉన్న గుంపుని ఓ కుక్క దాడిచేసి కాలుపై తీవ్రంగా కరిచి గాయపరిచింది. కుటుంబ సభ్యులు బాలుడ్ని టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు.


గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

ఇసుక లారీ పట్టివేత

కాశీబుగ్గ: మందస మండలం కొర్రాయిగేటు జాతీయ రహదారిపై పోలీసుల తనిఖీలలో ఓ ఇసుక లారీ సోమవారం పట్టుబడింది. ఒడిశా రాష్ట్రం కటక్ నుంచి పలాసకు ఇసుకలోడుతో అక్రమంగా వెళ్తున్న లారీని పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేనందున సంబంధిత ఇసుక లారీని సీజ్ చేశారు. మందస ఎస్సై ఖాదర్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

వికసించిన బ్రహ్మ కమలం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో నేతాజీనగర్‌లో షణ్ముఖరావు, సోమేశ్వరి దంపతుల ఇంటిలో బ్రహ్మ కమలం వికసించింది. అరుదుగా వికసించే పుష్పాన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు.


పలాసలో విరబూసిన బ్రహ్మ కమలం

బొజ్జగణపయ్యా.. వెళ్లి రావయ్యా..

గణపతి నవరాత్రి ఉత్సవాలు దాదాపు ముగిశాయి. దీంతో ఆదివారం రాత్రి, సోమవారం వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రసాదం లడ్డూలను వేలం వేయగా ఔత్సాహికులు వేలాది రూపాయలకు దక్కించుకొని భక్తిని చాటుకున్నారు. అలాగే కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలు జోరుగా జరిగాయి. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకుంది. సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.


కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి మొగిలిపాడులో రూ.50 వేలకు దక్కించుకున్న లడ్డూతో భక్తుడు బర్ల పాపారావు


కవిటి: రాజపురంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


వజ్రపుకొత్తూరు రూరల్: దోకులపాడులో సంప్రదాయ నృత్యాలతో అలరిస్తున్న చిన్నారులు


ఇచ్ఛాపురం: ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో అన్నప్రసాదం వితరణ


టెక్కలి రూరల్: లింగాలవలస రూ. 46 వేలకు దక్కించుకున్న లడ్డూతో చిన్నవాడు


కంచిలి: చిన్నశ్రీరాంపురంలో కుంకుమార్చనల్లో మహిళలు